క్లుప్తంగా

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని భక్తులు బుధవారం కిటకిటలాడారు. దేవాలయ పాలక వర్గం ఆధ్వర్యంలో అర్చక స్వాములతో స్వామి మూలవిరాట్‌లకు విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కె.వి.శ్రీరంగనాయకితో తిరుప్పావై ఆధ్యాత్మిక ప్రవచనం చేపట్టారు. గాయకులు జరీనా, పరమేశ్వరి బృందం భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. ధార్మిక ప్రాంగణంలో స్వాములకు సద్ది కార్యక్రమం, చండీహోమం జరిగాయి.

పారదర్శకంగా తెనాలి ప్రాంత అభివృద్ధి



తెనాలిరూరల్: నూతన సంవత్సరంలో తెనాలి ప్రాంతాన్ని పారదర్శకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల, పౌరసరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక బోస్ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు మంత్రిని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విజయవాడ, గుంటూరు నగరాలకు దీటుగా తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లే విధంగా కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు.

సామాజిక చైతన్యానికి కళలు దోహదం



లక్ష్మీపురం: సామాజిక చైతన్యానికి కళలు దోహదపడతాయని పాటకు ప్రభుత్వాల్ని కూల్చిన చరిత్ర కూడా ఉందని, సామాజిక మార్పుకు పాట ఒక సాధనంగా ఉపయోగపడుతుందని ఇప్టా జాతీయ కార్యదర్శి గని అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా సాంస్కృతి కార్యక్రమం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత, పాత సినిమాల్లో పాటల్లోని ప్రేమ గాతాలు కూడా సామాజిక స్పృహ ఉండేదన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సినీ దర్శకులు కనగాల జయకుమార్ మాట్లాడారు. అనంతరం పలువురు సాంస్కృతి కార్యక్రమాలు సినీ, జానపద గేయాలను ఆలపించారు.

ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ స్టాండ్ ప్రారంభం



లక్ష్మీపురం: ది గుంటూరు నగర ఆటో డ్రైవర్స్-వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జీజీహెచ్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ఆటో స్టాండ్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ ప్రారంభించారు. తొలుత సంఘం పతాకాన్ని యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు కోట మాల్యాద్రి అధ్యక్షతన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్‌కు ఎలాంటి సమస్యలు వచ్చిన అందుబాటులో ఉంటామని బలహీన వర్గాల వారి ఆశాజ్యోతి కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. అనంతరం ఆటో డ్రైవర్స్- వర్కర్స్‌కి 2025 నూతన సంవత్సరం సందర్భంగా యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మంగా శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, సిపిఐ జిల్లా కమిటీ నగర కమిటీ సభ్యులు చల్లా మరియదాస్, సమితి సభ్యులు ఆకిటి రామచంద్రుడు, స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు గౌడు శివ, ఇసుబు, నాయకులు బుడే, మస్తాన్, శ్రీను పాల్గొన్నారు.

కొబ్బరి తోట.. సమస్యల 'మూట'..

- మట్టిరోడ్లపైనే స్థానికుల నరకయాతన.. కానరాని సైడు కాల్వలు..
- పట్టించుకునే వారేరి.. కనీస మౌళిక సౌకర్యాల్లేవు..

ఇరవై ఏళ్లు అయినా అభివృద్ధి లేదు..



ఇంటి ముందు నిలిచిన మురుగునీరు నల్లగా..



ఏటుకూరురోడ్డు కాళికాదేవి గుడి దగ్గర్లోని ఖాళీస్థలం చెరువుగా మారె..

నగరంపాలెం: నగర శివారు ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అటువైపు కన్నెత్తిచూడడం లేదు. అభివృద్ధి జాడ లేదు. సమస్యలతో సతమతమవుతున్నారు. సుమారు ఇరవై ఏళ్ల క్రితం కొబ్బరితోట పేరుతో కాలనీ ఏర్పాటు అయినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

ఇరవై ఏళ్లుగా సమస్యలు..

స్థానిక 20వ డివిజన్ సంపత్‌నగర్‌కు సమీపాన కొబ్బరితోట ఏరియా ఉంది. ఇక్కడ సుమారు 140 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ ప్రాంతం ఏర్పాటై, ఇరవై ఏళ్లు గడిచింది. సుమారు నాలుగైదు వీధులు, అడ్డరోడ్లు ఉన్నాయని కూడా స్థానికులు చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నారు. మొదట్లో మట్టిరోడ్లుగా ఉండగా, ప్రస్తుతం అలాగే ఉన్నాయి. ఇక్కడ నివసించే వారి బంధువుల చిరునామా తెలుసుకోవాలంటే కష్టతరమే.. ఎందుకంటే ఫలానా వీధి అనీ, అడ్డ రోడ్డు అని స్థానికులు చెప్పే పరిస్థితుల్లో లేరు. ఇక రహదారులపై అక్కడక్కడ గుంతలు ఉన్నాయి. దీంతో ఆ రహదారులపై, అడ్డరోడ్లపై నడవాలంటే నరక ప్రాయంగా ఉంది. మోటారు సైకిళ్లపై వెళ్తే వాటి డిస్కులు పోతున్నాయని చోదకులు వాపోతున్నారు. ఒంటరిగా ఉండే వృద్ధులు, దివ్యాంగులు ఎక్కువగా నివసిస్తున్నారు. మరి కొందరైతే నగర పరిసరాల్లోని ఇంటి అద్దెలు చెల్లించలేక, అతి తక్కువ అద్దెలకు ఇక్కడ ఉంటున్నారు.

స్థల యాజమానులెక్కడ..

ఈ ప్రాంతంలో ఖాళీస్థలాలు ఎక్కువ. వాటి యాజమానులు ఎవరనేది స్థానికులకు తెలియదు. ఏళ్ల తరబడిగా ఖాళీగా ఉండటంతో ఆయా స్థలాల్లో తుమ్మచెట్లు, కంప, పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇటీవల కురిసిన వర్షపునీరు అందులోకి చేరింది. దీంతో నీరంతా పచ్చగా మారింది. దీనికితోడు పరిసర ప్రాంతాల్లోని పందులు అందులోకి దిగుతున్నాయి. విషసర్పాలు ఇళ్లల్లోకి వస్తున్నాయి. వర్ష కాలమైతే వర్షపు నీటిపై పాములు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ చూద్దామన్నా సైడు కాల్వలు కనిపించవు. స్థానికులే డ్రెయిన్లు తీసుకున్నారు. వాటిపై కూడా పచ్చగడ్డి మొలిచింది. దీంతో ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీళ్లన్నీ కూడా గుంతల్లో, ఖాళీ స్థలాల్లో నిలిచిపోతున్నాయి.



కొబ్బరితోట రెండో వీధిలో రహదారి ఇది..

డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేదు..



ఈప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థలేదు. దీంతో ఇళ్లల్లోంచి వచ్చే నీళ్లని ఇళ్ల ముందర చేరుతున్నాయి. రోజులు గడిచే కొద్దీ, ఆ నీళ్లన్నీ నల్లగా మారుతున్నాయి. దానిపై దోమలు వాలి, రాత్రివేళల్లో అవి కుడుతున్నాయి. కనీసం ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగునీరు బయటకు వెళ్లేందుకు డ్రెయిన్ తీయిస్తే, కనీసం మురుగునీళ్లు పోయేందుకు అవకాశం ఉంది. ఇళ్ల మధ్యలో ఖాళీస్థలాలు ఉన్నాయి. చెట్లన్నీ ఏపుగా పెరిగాయి. మట్టిరోడ్లు కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఆఖరికి సైడు కాలువల్లేవు. చాన్నాళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది.

–షేక్ అప్సనాభాను, స్థానికురాలు

వర్షకాలమైతే..

వర్షకాలమైతే పింఛన్‌లు పంపిణీ చేసేందుకు సచివాలయ సిబ్బంది ఇటువైపు వచ్చేందుకు ఆసక్తి చూపరు. ఎందుకంటే వర్షం నీటిలో రాలేమని చెప్పేవారు. దీంతో పెన్షన్‌దారులు అక్కడకెళ్లి తీసుకునేవారు. ఏటుకూరు రోడ్ కాళికాదేవి గుడికి దగ్గరలో ఖాళీస్థలం కాస్త చిన్నపాటి చెరువుగా మారింది. అటుగా రాకపోకలు సాగించే క్రమంలో జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన యేల్చూరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. చాంబర్ మాజీ అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి, కార్పొరేటర్ ఈ.వరప్రసాద్, టీడీపీ నాయకులు కొనకళ్ల సత్యం, చిట్టిప్రోలు రఘు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక పార్థనలు



నగరంపాలెం: కొత్తపేటలోని కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటీ గురుమండలంలో బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రొఫెసర్ కె.నిరంజన్ (హైదరాబాద్) ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. నూతన సంవత్సర ప్రత్యేకతను వివరించగా, ఈ ఏడాది అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. పలువురు భక్తి గీతాలను ఆలపించారు. పరిసర ప్రాంతాల వారు హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘకాపరులు రెవ.జె.దైవాశీర్వాదం, రెవ.పి.రమేష్, ట్రినిటీ ప్యారిష్ చైర్మన్ బి.గ్రేస్‌భీమరాజు, కోశాధికారి బత్తుల లెనిన్ పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



అప్పిరెడ్డి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



మేయర్ మనోహర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేటర్లు

పట్నంబజారు: శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కేక్ కట్ చేశారు.

శ్రీవారిని దర్శించుకుని అప్పిరెడ్డి

నూతన సంవత్సరం పురస్కరించుకుని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలి

నెహ్రూనగర్: నూతన సంవత్సరంలో నగర ప్రజలందరికి అన్ని శుభాలే జరగాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు బొకేలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా నగర ప్రజలకు నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో కొందరికి ఒడిదుడుకులు ఏర్పడినా 2025లో అన్ని శుభాలే జరిగి అందరు సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు పాల్గొన్నారు.

తులసి గ్రూప్ ఆధ్వర్యంలో ఉత్సవాలు



రామచంద్ర ప్రభును సత్కరిస్తున్న ఉగ్గిరాల సీతారామయ్య, తులసి యోగేష్ తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): తులసి గ్రూప్ ఆధ్వర్యంలో అరండల్ పేటలోని 'యోగి భవన్'లో బుధవారం న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, తులసి యోగీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్ర ప్రభు మాట్లాడుతూ రైతు సోదరులు, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని నూతన సంవత్సరం అందరికీ సరికొత్త భవిష్యత్‌ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. జిడుగు సుబ్బారావు ఆధ్వర్యంలో కర్రసాము విన్యాసాలు చేసిన విద్యార్థులను ప్రభు అభినందించారు. కార్యక్రమంలో పలువురు నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లు తులసి ప్రభు చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, ఏటుకూరు మాజీ సర్పంచి ఉగ్గిరాల సీతారామయ్య, కార్పొరేటర్ దాసరి లక్ష్మీరవి, కె.వెంకటేశ్వరరావు, కన్నా మార్కండేయులు, ఉగ్గిరాల అంకమ్మరావు, పసుపులేటి రమణయ్య, షేక్ ఖాశిం, తోటకూర వీరబాబు, శ్రీనివాస మోహన్, దళవాయి సుబ్రహ్మణ్యం, చందు పూర్ణచంద్రరావు, కనకం నరసింహారావు, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్, విష్ణుమొలకుల ప్రసాద్, నాగం అంకమ్మరావు, తిరుమలశెట్టి రమేష్, చిమటా అశోక్, చిమటా చైతన్య, కె.కె.నాయుడు, తులసి గ్రూప్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపి, రామచంద్ర ప్రభును సత్కరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



కృష్ణప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా నిలవాలని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక స్కూల్లో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ నూతన ఆలోచనలు, మంచి భావాలతో మిమ్మల్ని మీరు ఉన్నతంగా తీర్చుదిద్దుకునేందుకు ప్రయత్నించాలని, అందుకు పాఠశాల సహకరిస్తుందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలో అలరించారు. పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ విద్యార్థుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ కె.వెంకట్రావు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన సీతారామయ్య స్కూల్ విద్యార్థులు



విద్యార్థులతో విష్ణువర్ధన్, కృష్ణవేణి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్లోబల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, విశ్వాసం ప్రేరేపిస్తాయని, అథ్లెటిక్స్‌తో విద్యార్థుల్లో వేగం, బలం, ఓర్పు, మానసిక దృష్టి కలయికతో పాటు ధైర్య సాహసాలు, అపరిమితమైన నైపుణ్యం సొంతమవుతాయని అన్నారు. ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులతో విద్యార్థులకు అన్ని క్రీడల్లో అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్స్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీదేవి, సమన్వయకర్తలు దుర్గాశ్యామ్, శ్రీదేవి విద్యార్థులను అభినందించారు.

పలు పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు



వేడుకల్లో మాట్లాడుతున్న ఎండీ మున్ను



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సెబాస్టియన్

గుంటూరు ఎడ్యుకేషన్: మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ మున్ను పేర్కొన్నారు. బుధవారం సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ పాల్గొన్నారు.

మాంటిస్సోరి స్కూల్లో..

లక్ష్మీపురం, శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ క్యాంపస్‌లలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. లక్కీడిప్ ద్వారా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజు పాల్గొన్నారు.

పోలీస్ అటెన్షన్













నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నగరంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా నగరంలో పర్యటించారు. అర్ధరాత్రి తిరుగుతున్న యువతను హెచ్చరించారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

4 నుంచి శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని శ్రీమారుతీ దేవాలయంలో శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీమారుతి దేవాలయ సంఘం, శ్రీరామ సేవా సమితి వారణాసి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభి షేక మహోత్సవాలను ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు తంగిరాల శ్రీనివాసరావు తెలిపారు. మారుతీనగర్ దేవాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల మూడో తేదీన మారుతీ నగర్ పుర వీధుల్లో శ్రీసపరివార సమేత శ్రీరామచంద్రస్వామి శోభాయాత్ర ఉంటుందని అన్నారు. తొలి రోజు శ్రీమద్రామాయణ పారాయణ, హోమాలు, శ్రీసపరివార సమేత శ్రీరామచంద్ర స్వామికి సహస్ర నామార్చనలు, ఐదారు, తొమ్మిది తేదీల్లో పవళింపు సేవలు, ఏడో తేదీన శ్రీఆంజనేయస్వామికి సహస్రనామార్చనలు, నాగవల్లీ దళాలతో, ఎనిమిదిన సపరివార సమేత శ్రీరామచంద్రస్వామికి పంచామృత, ఫలరస, సుగంధ ద్రవ్య అభిషేకాలు, 10న వైకుంఠ ఏకాదశి, శ్రీ సీతాఅమ్మవారి లలితా సహస్రనామ అర్చన, 11న శ్రీసీతారామచంద్రస్వామి శాంతి కల్యాణ మహోత్సవం, 12 న శ్రీమారుతీ దేవాలయ సంఘ పక్షాన పండిత సత్కార కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.